International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-9(1), September 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# మతం – స్త్రీవాద సాహిత్యం

**డా॥ ఏటూరు జ్యోతి**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు
యూనివర్సిటీ ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్,
హనుమకొండ

మానవుడికి ప్రకృతికి అతీత ఒక సృష్టికర్త ఉంటాడని ఆలోచన. ఆ సృష్టికర్తకు మానవాతీత శక్తులుంటాయని, అవి దేవతల అజమాయిషీలో ఉంటాయని ప్రతీతి. మానవ జాతి అన్ని దశల్లోనూ దేవుడు / మతం అనేవి అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నవి. మతానికి ఒక ప్రామాణిక గ్రంథం ఉంటుంది. అది మనిషి పుట్టుక గురించి, ప్రకృతి ఆవిర్భావం గురించి, సమాజ నియమాల గురించి కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలను కలిగి ఉంటుంది. అదే సత్యమైనదని ప్రకటిస్తుంది. ఆచరించమని ఆదేశిస్తుంది. లేదంటే శిక్షిస్తానంటుంది. దేశంలో మత సంస్కరణ ఉద్యమాలు ప్రారంభమైనపుడు ఆంధ్రలో వాటి ప్రభావం సాహిత్య పరంగా కనిపించింది. బెంగాల్‌లో బ్రహ్మసమాజం విగ్రహారాధనను, సతీసహగమనం పోవాలని బాల్యవివాహాలు ఆపాలని, వచ్చిన ఉద్యమస్ఫూర్తితో కందుకూరి వీరేశలింగం ఆ సమస్యల్ని తన రచనల్లో ప్రతిబింబించారు. కన్యాశుల్కం, వ్యభిచారం వంటి దురాచారాలతో గురజాడ అప్పారావు రచనలు చేశారు. స్త్రీ స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, విద్యల శిక్షణలో శాస్త్రీయ దృక్పథంతో చలం రచనలు చేసారు. కట్టమంచి రామలింగారెడ్డి గారు ప్రబంధాలలో, భారతంలో స్త్రీలను చులకనగా చూసిన పద్ధతిని ఎత్తిచూపి ద్రౌపది వంటి పాత్రలను కీర్తించారు. మతాన్ని మానవుడు సృష్టించాడు. మతపరంగా ఎంతో సాహిత్యం వచ్చింది. మతం మానవుడికి ప్రాధాన్యత తగ్గింది. అతడిని దేవుడికి బానిసగా, మూఢనమ్మకాలు మనిషిని ఇబ్బంది పెట్టాయి. వీటిని భరించలేక మతసంస్కరణలతో అనేక రచనలు వచ్చాయి. దాని సంప్రదాయవాదులు సంస్కరణలను వ్యతిరేకించారు. విశ్వనాథ సత్యనారాయణ వంటి వారు మతాన్ని ప్రోత్సహించారు. త్రిపురనేని రామస్వామి చౌదరి వంటివారు మత, మతాన్ని వ్యతిరేకిస్తూ రామాయణ, భారత, భాగవతాలలోని అమానుష విలువల్ని చూపుతూ రచనలు చేసారు. మతం ముసుగులో సాగుతున్న అంటరానితనాన్ని ఖండిస్తూ జాషువా ఎన్నో కవితలు రాశారు.

మన దేశం ప్రపంచం ముందు ఉన్నతంగా ఉండాలని రాజ్యాంగం లౌకిక భావనకు పెద్దపీట వేసింది. లౌకికవాదాన్ని నిర్వచించాలంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితం మతప్రభావం నుంచి బయటపడి ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా రూపొందాలని కోరుకుంటుంది. వర్ణాశ్రమధర్మం, కులమత ఆచారాలు, మత సంబంధమైన నమ్మకాలు పట్టిపీడించడమే కాక, అవి రాజకీయ జీవితాన్ని శాసిస్తున్నాయి.

ఏ నాగరికత అయినా, సమాజం అయినా స్త్రీని గౌరవించాలని, స్త్రీకి ప్రాధాన్యమివ్వాలనేది ఆధ్యాత్మిక గ్రంథాల్లో నీతి సూక్తులుగానే మిగిలిపోతున్నాయి. మతం ముసుగులో స్త్రీని పలురకాలుగా అణిచివేస్తున్నారు. తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలు దళితవాదం, స్త్రీవాదం, ముస్లింవాదసాహిత్యాలు తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని నిలబెట్టుకున్నది. ఆధునిక సాహిత్యంలో వచ్చిన వివిధ ధోరణుల వలన స్త్రీ, దళిత, ముస్లిం, మైనారిటి సాహిత్యం అనే విభజన సాహితీవేత్తలందరూ అంగీకరించారు. ముస్తిం సాహిత్యంలో ముస్లిం స్త్రీవాద సాహిత్యంను ప్రత్యేకంగా తీసుకువస్తున్నారు. తెలుగులో స్త్రీవాదం వచ్చిన తర్వాత దళిత, ముస్లిం మైనారిటీ వాదంలోనూ, స్త్రీలు తమ సమస్యలను కవిత్వీకరిస్తున్నారు. అయితే స్త్రీలు రాసిన కవిత్వంలో మరింత బలంగా ముస్లిం స్త్రీ సమస్యలు అభివ్యక్తమయ్యాయి. ముస్లిం స్త్రీ సమస్యలను షాజహానా, మున్వీరునిసా, మహేజబీన్, షహనాజ్ ఫాతిమా స్త్రీ వాద దృక్పథంతో రచనలు చేస్తున్నారు. ఖాదర్ మెహీయొద్దీన్ "పుట్టుమచ్చ"లో "గుజరాత్ గేయం", "ఆజా", ముస్లింల సాహిత్య ప్రత్యేక సంకలనం "ముల్కి", "స్కైబాబా", "జగన్ కేరాత్", "ఖాజా", "ఫత్వా" మొదలైన వాటిలో ముస్లిం స్త్రీవాదం కనిపిస్తుంది. ఇంటిలో స్త్రీ పురుషుల మధ్య కనిపించే వివక్ష, ఇతర స్త్రీలకున్నట్లే ముస్లుం, స్త్రీలలోనూ ఉంది. ఉన్నత విద్య లేకపోవడం, నిర్ణయాధికారం లేకపోవడం వల్ల ముస్లిం స్త్రీలు మరింత వివక్షకు గురవుతున్నారు. బయటకు కనిపించే బురఖా ఆ బురఖా వెనుక ఎన్నో నిర్బంధాలు, బహు భార్యత్వ సమస్య, బహు సంతానోత్పత్తి కోసం అనుభవించే లైంగిక వివక్ష, భర్త చనిపోతే స్త్రీ పునర్వివాహం పట్ల తలెత్తుతున్న పరిణామాలు ముస్లిం స్త్రీలు వారి ఆచార వ్యవహారాల్లో కలిగే ఇబ్బందులు అనేకం.

ముస్లిం స్త్రీల బతుకు వేదనను, హింసను కవిత్వంగా మలిచిన తొలి ముస్లిం తెలుగు కవయిత్రి షాజహానా బురఖా, గుట్టు విప్పిన కవయిత్రి షాజహానా. ఈమె రాసిన కవితలలో ముస్లిం స్త్రీలందరికి ఆత్మస్థైర్యాన్ని నింపి, మనోబలాన్ని అందించేవి. ముస్లిం సమాజంలో అంతర్గత ప్రజాస్వామ్యం కోసం, స్త్రీలను ముస్లిం పురుషుల ఆధిపత్య సంకెళ్ళ నుండి విముక్తం చేయడం కోసం చేసే పోరాటం. ముస్లిం స్త్రీలలో స్వేచ్ఛాకాంక్షను తాము అనుభవిస్తున్న బతుకుల నుండి బయట పడాలనే కాంక్షను షాజమానా కవిత్వం వెల్లడిస్తుంది. ముస్లిం పవిత్ర గ్రంథంగా భావించే ఖురాన్‌లో ముస్లిం వివాహ వ్యవస్థ గురించి ఉంది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనే బహు భార్యాత్వాన్ని అంగీకరించ వచ్చునని స్పష్టంగా ఉంది. దీన్ని వక్రీకరిస్తూ, మత పెద్దల అండదండలతో స్త్రీ అభిప్రాయాలకు విలువనివ్వకుండా జరుగుతున్న వివాహం గురించి, ఆ వివాహాల వెనుక ఉండే దయనీయ గాథల గురించి కవిత్వం వచ్చింది. ఒకవైపు పేదరికం, మరోవైపు మూఢత్వం చేసే పెత్తనం. ముస్లిం స్త్రీలు సమస్యల నుండి బయటపడాలంటే మహిళలు మరింత

అక్షరాస్యులు కావాలి. స్వీయమతంలోని దురాచారాలను ఖండిస్తూ, మరొక వైపు మాతృదేశంలో తమ అస్తిత్వాన్ని నిరూపిచుకుంటూ, అగ్రవర్గానికి క్రింది వర్గానికి మధ్య నలిగిపోతూ ఉన్నారు ముస్లిం స్త్రీలు.

## ముస్లిం మతం

"నీలి మేఘాలు"లో యస్. రజియా బేగ స్త్రీని ఎలా చూస్తుందో తెలుసుకోవడానికి ఈ కవిత చాలు.

బాల్యంలో –

"చిన్న పిల్లవి నీకేం తెల్సు!" కూర్చో అన్నారు.

యవ్వనంలో –

"ఉడుకు రక్తం – మంచీచెడూ తెలీదు!" కూర్చో అన్నారు.

వృద్ధాప్యంలో –

"ముసల్దానివి ఇంకేం చేస్తావ్!" కూర్చో అన్నారు.

అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు కూర్చుని కూర్చుని బద్దకం వచ్చినందుకే బాధగా ఉంది అంటుంది.

## క్రైస్తవ మతం

**వేశపోగు గుల్బానమ్మ (1905–71)**

ఆడవాళ్ళు చర్చిలో పాస్టరు కాకూడదు అనే నియామాలున్న రోజుల్లో గుల్బానమ్మ పాస్టర్ కావడం మత కట్టుబాట్లను అధిగమించిందని నిరూపిస్తుంది. లేదా ఆ సమయంలో పాస్టరుగా పని చేసే సామర్థ్యం ఉన్న మగవారు అక్కడ లేకపోవడంతో తప్పని పరిస్థితులలో ఆ సామర్థ్యం కలిగిన గుల్బానమ్మ పాస్టర్‌గా ఉండవచ్చు. ఆ కాలంలో స్త్రీలు చర్చి వేదికనెక్కి ప్రసంగాలు చేయడమనేది మత నియమాలకు విరుద్ధం. కనుక వేదిక మీద ప్రసంగిస్తున్న సమయంలో నామమాత్రంగా ఒక పురుషుడు వేదికను అలంకరించేవాడు. ఈమె మాత్రం బోధన చేసేది. తను రాసిన కీర్తనల్లో, బోధనల్లోని భాష, భావ ప్రక్రియలు ఆనాటి సామాజిక, రాజకీయ, మత పరిస్థితులకు అనుగుణంగా కనిపిస్తాయి.

అన్ని మతాలు స్త్రీని అణిచివేసే ధోరణితోనే వ్యవహరించాయి. మతాలు స్త్రీ జీవిత పరిధిని నిర్దేశించాయి. ఒక నిర్ణీత పరిధిలో జీవించాలని ఎప్పటికప్పుడు సిద్ధాంతాలు చేస్తాడు.

## హిందూ మతం

వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, అరణ్యకాలు, బ్రాహ్మణాలు, అనేక రూపాలలో హిందూ సంస్కృతి మనిషి జీవన విధానం నుండి విడదీయరానిదిగా మారింది.

మనుస్మృతి స్త్రీని, స్త్రీ పుట్టుక నుండి మరణం వరకు వివిధ రకాల కట్టుబాట్లు నియమాలను తయారు చేసి దాంట్లోనే బందీ చేసింది హిందూమతం.

స్త్రీని శారీరకంగా, మానసికంగా బందీని చేసింది.

మతం పేరుతో, సామాజిక కట్టుబాట్ల పేరు మీద, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల పేరు మీద మతం సాగిస్తున్న అణిచివేతపై స్త్రీలు తిరుగుబాటు చేస్తున్నారు. మన సంస్కృతిలో భర్త కోసం, తన బిడ్డల కోసం, బంధువుల కోసం సేవలు చేసే యంత్రంలాగా మారింది. ధర్మశాస్త్రాలు స్త్రీకి కర్మసిద్ధాంతం బోధిస్తూ – ఆమెను తనకు జరిగే అన్యాయాలకు, అక్రమాలకు స్పందించకుండా చేసిందీ సమాజం.

## పతి భక్తి

మతాధిపత్యం మధ్యతరగతి స్త్రీని, శ్రామిక వర్గపు స్త్రీని ఒకే రకంగా నియంత్రిస్తున్న విధానాన్ని ఈ కథ చెప్తుంది. మగవాళ్ళకు పూజించేందుకు ఎవరి దేవుడు వాళ్ళకు ఉండవచ్చు. మందుల కంపెనీ మేనేజరుకు అయ్యప్ప స్వామి కావచ్చు. నాల్గవ తరగతి ఉద్యోగి రమేషుకు భవానీ దేవి కావచ్చు. కానీ వాళ్ళ వాళ్ళ భార్యలకు మాత్రం పతి ఒక్కడే దైవం. అతన్ని అనుసరించి అతని ఆరాధనకు తోడ్పడడమే వాళ్ళ కర్తవ్యం. వాళ్ళు మాలలు వేసుకుని దీక్షలో ఉన్నంత కాలం మందుల క ంపెనీ మేనేజరు భార్యకైనా, పని మనిషి మంగకైనా తప్పని పతిదేవ. మామూలు రోజుల్లో కంటే అదనంగా అగ్గగ్గలాడుతూ దైవానికి, భర్తకు కూడా అపచారం జరగకుండా వాళ్ళు చేయాల్సిన చాకిరీ వాళ్ళకొక పెద్దహింస. భక్తి అయినా, రక్తి అయినా అనుభవం వాళ్ళది. ఆయాసం మనది అని ఒక యజమానురాలు పని మనిషి మంగతో సహానుభవాన్ని ప్రకటించింది. ఈ విధంగా పితృస్వామిక సంస్కృతిని మతం అన్ని వర్గాల స్త్రీల మీద ఏ మినహాయింపు లేకుండా ఎలా రుద్దుతుందో చూపించారు.

పతి భక్తి కథ 'భక్తి అయినా, రక్తి అయినా అనుభవం వాళ్ళది. ఆయాసం మనది', మతం, భక్తి మొదలైన సాంస్కృతిక రూపాలు కూడా పితృస్వామ్యాన్నే బలోపేతం చేస్తూ, పితృస్వామ్య అధికారమే ఈ రూపాల ద్వారా వ్యక్తమవుతూ స్త్రీల జీవితాలను శాసిస్తున్న తీరును స్త్రీవాద కథ. ప్రతిఫలించింది. అయ్యప్ప

మాలలు, భవానీ మాలలు వేసుకుని పురుషులు దీక్ష పట్టడం, పురుషుడిని దేవుడి స్థానంలో నిలిపి, స్త్రీలు నోరు మెదపకుండా భయభక్తులతో చాకిరీ చేయటానికే ఉపయోగపడుతున్నారు.

స్త్రీ కూడా మనిషేనని ఆమెకు స్వేచ్ఛ, సమానత్వం, వ్యక్తితం ఉండాలని ఏ మతమూ బోధించనే లేదు. అందువల్లనే పురాణయుగం నాఇ ప్రాతివత్యాన్ని, నోములు, వ్రతాలు, పూజలు వంటి మతపరమైన క్రతువులను స్త్రీలింకా పాటిస్తున్నారు. స్త్రీల కాలమంతా ప్రార్ధనలకు బాబాలు, పురాణ శ్రవణాలకు వినియోగిస్తారు. ప్రాతివ్రత్యం పేరుతో భర్త ఎంత దుర్మార్గుడయినా, దుష్టుడయినా తమ ధన, మాన ప్రాణాలు అర్పిస్తున్నారు. స్త్రీ జీవితమంతా మూఢాచారాల ముసుగులో మిళితమయి ఉంటుంది. మహిమలు, బాబాలు, మంత్రతంత్రాల నమ్మకం స్త్రీలలో ఎక్కువగా ఉంటుంది. ఈ తరతరాల దాస్యజీవనకు మత ప్రభావమే నాంది.

మహిళలకి భర్త ద్వారానే గుర్తింపు వుంటుంది. భారత సమాజం వైధవ్యం పట్ల తీసుకునే వైఖరితో అన్ని మతపరమైన సందర్భాల్లో, శుభకార్యాల్లో విధవరాలు, అమంగళం అని, సామాజికంగా ఆమె కదలికలన్నీ, నియంత్రించబడి, ఆమె ఉనికిని కోల్పోయే స్థితికి దిగజార్చబడుతుంది. సహజసిద్ధ ఋతుక్రమాన్ని అశుద్ధంగా భావించి అనేక, ఆంక్షలు విధిస్తారు. వంటింట్లోకి రాకూడదని, ఇంటి పనుల్లో పాల్గొనకూడదని అంటారు.

దేవునిపై విశ్వాసం ఉండి, దేవుని పూజా విధానాన్ని గాని, ప్రార్ధనా రీతిని గాని నిర్దేశించేది మతం, సర్వాంతర్యామిగా, సర్వశక్తిమంతుడిగా సమన్వితుడుగా చెప్పబడే దైవానికి, వ్యక్తికి మధ్య వుండే సంబంధాన్ని నిర్ణయించేది మతం.

మతం మానవుడి అజ్ఞానంతో, భయాందోళనలతో మొదలైంది. క్రమేపి ఇది సమాజంలో ప్రబలశక్తిగా, మానవులను తన ఆధీనంలో ఉంచుకునేట్లుగా రూపొందింది. ప్రజల మనోభావాలపై దానికున్న పట్టును గ్రహించి, తమ స్వప్రయోజనాలకు వాడుకోడానికి సమాజంలోని కొన్ని వర్గాలు తయారయ్యాయి. మతం వీరికొక సిద్ధాంతపరమైన సాధనంగా తయారయింది. మతంతో పాటు దైవం, మరోజన్మ, పాపపుణ్యాలు, మోక్షం, ముక్తిలాంటి భావాలు తలెత్తాయి. వీటి చుట్టూ మానవ జీవితాన్ని, పుట్టుకనుంచీ మరణం వరకూ నిర్దేశించే ఎన్నోరకాల పూజలు, క్రతువులు పెరిగాయి. మత సారాన్ని, వాస్తవంలో అర్థం చేసుకోక పోయినా అది అందించిన ఊరట, మనశ్శాంతి, అపుడు, ఇపుడు కల్గిస్తున్న మాట వాస్తవం. ఇది నిజం కాదని, కేవలం తాత్కాలిక మానసిక శాంతిని మాత్రమే ప్రసాదిస్తాయని ప్రజలకు తెలిసినా దాన్ని గూర్చి పట్టించుకోకపోవడం మామూలైంది.

## స్త్రీలు

బానిస బ్రతుకు సాగించే వ్యక్తికి స్వేచ్ఛ స్వరూపం తెలియదు. బానిసత్వాన్ని గ్రహించడానికే చాలా కాలం పడ్తుంది. స్త్రీల విషయంలోనూ అలాగే జరిగింది. తమను స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు దూరం చేసిన మత ప్రమాణాలు, అవతార మూర్తుల ఆదేశాలు, ప్రవక్తల బోధలు, మతాచార వ్యవహారాలు అన్ని తమ మేలు కొరకే ఏర్పాటు చేయబడినవని వీరు విశ్వసించారు. హిందూ, క్రైస్తవ, ముస్లిం మతాలు స్త్రీలపట్ల అనేక విధి నిషేధాలు విధించాయి. వారికి బాధ్యతలే తప్ప హక్కులు అధికారాలు కాగడాలేసి గాలించినా దొరకవు.

ఏ దేశంలోనూ, ఏ మంతంలోనూ, ఏనాడూ ఏ స్త్రీ సమాన హోదా అనుభవించినట్లు ఆధారాలు లేవు. వేదాలు చదివిన కాలం నుండి వ్యవస్థను పరిశీలించిన స్త్రీకి విశిష్టత ఉన్నట్లు కన్పించదు. స్త్రీలు వేదం చదువరాదనే ఆంక్షలు కూడా వచ్చాయి. స్త్రీ అంటే ఆటబొమ్మని, బానిస అని భర్తకు సేవ చెయ్యటమే ఆమె విధి అని నిర్ణయించారు. మత దృష్టిలో సమాజం అంటే పురుషులేనని, వారి అవసరాలను తీర్చే యంత్రం మాత్రమే స్త్రీ అని తేల్చారు. మతం స్త్రీ స్థానాన్ని, మగవాడి పాదాల చెంతనే ఉంచింది. శైశవం దాటగానే మెల్లిగా మాట్లాడాలని, తలెత్తుఉని తిరుగదాదని, నిటారుగా నిలబడరాదని శాసించింది. భర్త ఆజ్ఞలను శిరసావహించాలని అత్త, మామలకు అణిగి మణిగి ఉండాలని స్త్రీకి ఇల్లే స్వర్గమని, భర్తే పరమదైవమనే విధివిధానాలు మన పురాణాల్లో ధర్మశాస్త్రాల్లో దర్శనమిస్తాయి. హిందూ మతం, ఇస్లాం, క్రైస్తవం మనుధర్మశాస్త్రం, ఖురాన్, బైబిల్ వాటి మ గ్రంథాలు అవి స్త్రీని చాలా నీచంగా చిత్రించాయి.

భర్త క్రూరుడైనా, కొట్టినా, చంపినా, భర్తనే ప్రత్యక్ష దైవంలా పూజించాలని నిర్వచించింది. హిందూ మతం. ఇస్లాం స్త్రీలను, జంతువులతో పోల్చింది. స్త్రీని పొలంగా పేర్కొంటూ దానిపై సర్వాధికారాలు దున్నే వాడిదేనంటూ ఖురాన్ పేర్కొంది. స్త్రీని పాపాలకు మూల కారణమైన 'ఈవ్'గా ప్రతిపాదించింది క్రైస్తవం. 'నీకు విధేయత చూపుతానని' పెళ్ళి నాటి ప్రమాణాల్లో స్త్రీచే ప్రమాణం చేయిస్తుంది. పురుషుని ముందు సృష్టించి, అతని సంతోషం కోసమే స్త్రీని దేవుడు సృష్టించాడని ప్రచారం చేస్తోంది బైబిలు.

## ముస్లిం స్త్రీలు

ఇంటిలో స్త్రీలు నివసించే భాగం, పురుషులు నివసించే భాగం వేరుగా ఉంటాయి. ఇంట్లో కూడా తన పురుష బంధువులు మామ, భావ, మరిది, కుమారుడు, అన్న, తమ్ముడు మొదలైన వారి యెదుట నడయాడే తీరులో తేడాలు వుంటాయి. ఇల్లు దాటి వెళ్ళాల్సి వస్తే వెళ్ళతగిన ప్రదేశాలు వేరుగా ఉంటాయి.

ఇల్లుదాఇ ఆమె వెదలినపుడు ఆమె వేషధారణ, ఆమెకు తోడు అనివార్యం అయ్యింది. పర పురుషులు తన పురుష బంధువుల కోసం వచ్చినప్పుడు ఆమె కాని, వచ్చిన వారు కాని సంచరించవలసిన పద్ధతి తలుపు చాటు నుండి సమాధానం చెప్పటం మొ॥.

బహు భార్యత్వం, తలాక్, ఆచరణ గోషా పద్ధతి, బురఖా, నిరక్షరాస్యత ముస్లిం స్త్రీల పురోగమానికి ప్రతిబంధకాలుగా ఉన్నాయి.

"దేవుడు బిడ్డలను ఇస్తున్నాడు. తిరస్కరించడం పాపం" అనే వాదన ముస్లింలలో వున్నది.

ఎవరో కప్పిన సెహెరా సాక్షిగా
నువ్వెప్పుడైనా ఎదురుపడితే
నేను గుర్తుపట్టగలిగేది
కేవలం నీ రెండు కళ్ళని మాత్రమే (ఆదా హై చంద్రమా)

గుమ్మానికి కట్టినట్లే అమ్మ ముఖానికి బురఖా కడితే ...
ఏఏ మహాస్వప్నాలు ఒంటరి పరదాల గుహలలో బలైపోతున్నాయో..
ఇవాళ్టి పద్నాలుగేళ్ళ నా వసంతాన్ని
60 ఏళ్ళ శిశిరాని కంకితమియ్య మంటే
అరబ్ కబేలాలో ఆడదాని మాంసానికింత రేటుందని తెలియనిదాన్ని

ఎవరెస్టులేంటి? చంద్రున్ని సైతం తాకొస్తున్న స్త్రీలను చూస్తూ సంసారాలనేంటి? ఇంగ్లీష్ ఛానెల్‌నీ ఈదుతున్న ఈతరం స్త్రీలనూ చూస్తూ.

ఇంకా ఇంకా మౌనంగా ఉండడం నా వల్ల కాదు.
రంగు రుచి వాసన లేని బతుకులీడుస్తున్న గబ్బిలాలం.
ఈ పరదా పంజరాన్నిప్పుడు నిలువునా చీలుస్తున్నా
నన్ను కాఫిర్ వన్నా బాధ లేదు!
కౌగిలించుకున్న ఈ చేతులే
కాళ్ళు పట్టుకున్న ఈ చేతులే
పిడికిళ్ళు బిగిస్తున్నాయ్.

**International Journal of Academic Research**
**ISSN: 2348-7666; Vol.4, Issue-9(1), September 2017**
**Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in**

ఎవరితోనే లేచిపొయ్యి
ఎక్కడ మత కాలుష్యాన్ని చేస్తాననేగా
గోషాల చెరసాలలు, కొట్టాల్లో పశువులా, షారాల్లో కోళ్ళు
చీకటి కొట్లలో మేము.

బురఖాల్ని దుపట్టాల్ని,
పిలీకలుగా చేసి నీ మెదికి విసిరేస్తున్నా
కలిపి బొంత కుట్టుకుని పొర్లుకో.

ఏ మతమైనా స్త్రీ అణచివేతకు అతీతం కాదు. ముస్లిం స్త్రీలకు సంబంధించి మత పరంగా, కుటుంబ పరంగా కొనసాగే అణిచివేత కొంత భిన్నంగా కఠినంగా అనిపిస్తుంది.

సాంప్రదాయంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న స్త్రీలు కొందరయితే పురుషాధిక్యతకు తోడు మత వివక్షకు బలవుతున్న వారు ముస్లిం స్త్రీలు

ఎక్కడైతే అణిచివేత ఉంటుందో అక్కడే తిరుగుబాఉ పుడుతుందని నిరూపిస్తూ షాజహానా వంటి ముస్లిం స్త్రీలు గొంతు విప్పారు. ఆర్తి, బాధ, ఆవేదన, ఉక్రోషం అన్నింటిని మించి తిరుగుబాటు కనిపిస్తుంది. ఖబర్దార్ కవితలో షాజహానా సంప్రదాయాన్ని నిలదీస్తుంది. పిడికిలి భిగించి సవాల్ చేస్తుంది. ఆమె గుండెలోతుల్లోంచి పొంగిన ఆవేదన, ఆక్రోశం పరదాలను చీలుస్తూ, ఇనుప సంకెళ్ళను పగులగొడుతూ మత వాదం మీద, పురుషాధిపత్యం మీద తిరుగబడుతుంది.

ఆంధ్రదేశంలో దళిత ఉద్యమానికి ఊపిరి పోసిన ఓ అలీశమ్మ. క్రైస్తవ స్త్రీ సమాజంలో అనేక రూపాలలో అణిచివేతను ఎదుర్కొంటుంది. జాషువా చెప్పిన నాలుగు పడగల హైందవ నాగరాజు భారతీయ సమాజాన్ని కులం పేరుతో కాటేసి, వర్గాలుగా చీల్చి వేసాడు. ఈ సామాజిక సమీకరణలో సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురైనదారే దళితులు. వేదాలు చదివితే నాలుక కోసివేయమని, వింటే వేడి సీసం కరిగించి పోయాలని, చూస్తే కనుగుడ్లు పీకివేయాలని సూత్రీకరించింది సమాజం. హిందు మతంలోని అగ్రకుల దురహంకారుల వల్ల వెలివేయబడ్డ దళితులు, శూద్రుల్ని క్రైస్తవం గుండెలకు హత్తుకుంది. వారిని జంతువుల కంటే హీనంగా చూస్తూ, దేవాలయాలకు, విద్యాలయాలకు దూరంగా ఉంచినప్పటికి క్రైస్తవ మిషనరీలు మీరు కూడా దేవుని బిడ్డలే అని ప్రార్థనా మందిరాలలో ప్రవేశం కల్పించడం చేత హిందూ మతం నుండి వెలివేయ బడ్డకులాల వారు క్రైస్తవ మతంలో చేరి, స్వేచ్ఛగా ఉండగలగడం కనిపిస్తుంది

సమాజంలో అంతర్గతంగా, బహిర్గతంగాను మతం యొక్క పితృస్వామిక విలువలతో క్రైస్తవ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల స్పందించే రచనలే క్రైస్తవ సాహిత్యం. క్రైస్తవ స్త్రీల ఆలోచనలను, భావోద్వేగాలను, సంస్కృతిని వివిధ సాహిత్య ప్రక్రియలలో వెలికితీయాలి. అన్ని మతాల వలెనె క్రైస్తవ మతం స్త్రీని రెండో తరగతి పౌరురాలిగానే చూస్తుంది. కాకపోతే మతంలోని కొన్ని వెసులుబాట్ల వలన స్త్రీ సామాజికంగా, ఆర్థికంగా ఓ మేరకు నిలదొక్కుకోగలిగింది.

ఏమతమైనా మానవీయ విలువలకు పట్టం కట్టి సమానత్వ ప్రాతిపదికగా ఉండాలి. ఆ విలువలే సాహిత్యంలో ప్రతిఫలించాలి.